# జీవనమాధుర్యం

ఆ సాయం[త్రానికి అన్యోన్య దాంపత్యంపైన ఓ కథ పూర్తి చేశాను. కథ చాలా తృప్తికరంగా అనిపించింది. మునుపు చాలా కథలు రాశాను. వాటికోవ పేరు. అన్యోన్య దాంపత్యాన్ని ఆధారం చేసుకొని రాసిన ఆ కథకోపే పేరు.

అసలు ఆ కథకు [ప్రేరణ ఎవరో వారిని గురించి కొంతైనా చెప్పుకోవాలి....

నేనుంటున్న డాబా కెదురుగా రెండంతస్తుల అధునాతన భవనమొకటుండి. అందులో— ఒకే ఒక అందమయిన జంట. ఒకరి కోసం ఒకరు పుట్టినట్టుంది అన్న అనుమానం ఎవరికైనా వస్తుంది. తెల్లటి ఒళ్ళూ ఉంగరాల జుత్తూ, అందమయిన ముఖకవళికలూ, ముదురురంగు దుస్తులూ, నాలుగు అంగుళాల హైహీల్డు బూట్లూ అతని తాలూకు వర్ణనయితే— పసిమి రంగు మేనూ, పొడుగాటి వేళ్ళూ, పల్చటి పెదాలూ, నల్లటి కళ్ళూ, లేత రంగు దుస్తులూ, అతి తక్కువ నగలూ, మరీ మరీ చూడాలనిపించే అందం... ఆమె తాలూకు వర్ణన. వారి పేర్లుకూడా వారికి తగ్గ అందమైనవే. కిరణ్, లావణ్య.

నేనీ డాబా ఇంటికొచ్చి దాదావు నెల కావస్తోంది. ఒంటరిగాణ్ణి కావడం మూలాన ఆ దంపతుల్నే ఎక్కువగా చూడాల్సి వచ్చేది. నేను

ఆఫీసుకు బయల్దేరటానికి గంట ముందుగా కిరణ్ తన స్కూటర్ని షెడ్‌నించి గేటు బయటికి తెచ్చి పెట్టేవాడు. ఆ తర్వాత లావణ్య వచ్చి గేటువద్ద నిలబడుతుంది. కిరణ్ ఆమెవంక ప్రేమగా చూస్తూ స్కూటర్ స్టార్ట్ చేసి బయల్దేరుతాడు. కిరణ్ వీధి మలుపు తిరుగుతూ చెయ్యెత్తి గాలిలో ఆడిస్తూనే— లావణ్య చిరునవ్వుతో తన చేయిని ఆడిస్తూ ఒక్కక్షణం ఆగి లోనికి వెడుతుంది. నేను ఎన్ని పనుల్లో వున్నా ఆ దృశ్యం చూడ్డానికి ఠంచనుగా డాబా వరండాలోకి చేరేవాణ్ణి.

కిరణ్ ఏదో ప్రైవేట్ కంపెనీకి మేనేజరనీ, వాళ్ళ పెళ్ళయి ఐదేళ్ళయిందనీ పక్కింటి రావుగారు చెప్పేరు.

నేను ఇష్టపడే ఇంకో ఘట్టం కూడా వుంది. ఆఘట్టం చూడ్డం ఎప్పుడూ నాకు కుదిరేది కాదు. నేను ఏ క్యాజువల్ లీవో, సిక్ లీవో పెట్టినప్పుడు తప్ప. ఆ ఘట్టం ఏమిటంటే— ఐదున్నర గంటలకల్లా లావణ్య గేటువద్ద వీధిలోకి తొంగిచూస్తుంటుంది. వీధి మొగదలలో స్కూటర్‌మీద కిరణ్ కనబడ్డాడా ! ఆమె మొహం అప్పుడే విచ్చుకున్న పూవులా— అవుతుంది. కళ్ళు రెండూ నవ్వుతాయి. కిరణ్ స్కూటర్ని లోపలికి పెడుతోంటే ఆమె కాఫీ తేవడానికేమో లోపలికెడుతుంది.

ఎపుడయినా వాళ్ళిద్దరూ షికారుకని కదిలారో మా వీధివాళ్ళ కళ్ళన్నీ వాళ్ళ మీదే.... కిరణ్ ఎప్పుడూ ఆమెపై కేకలేసినట్టుగాకాని, ఆమె మనసు నొప్పించినట్లుగాకానీ, నే చూడలేదు.... ఎంతసేపూ నల్లటి మెరుపుల్తో నిండిన ఆమె కళ్ళవేపో, వింతగా కదుల్తోన్న పెదవుల వేపో, చూసేవాడు. సాయంకాలాలు ఎక్కువగా వాళ్ళింటికున్న చిన్న పార్కులో గడిపేసేవాళ్ళు. ఆయన ఎలా జోకులు వేసేవాడోకాని ఆమె గలగలా నవ్వేది. ఆనవ్వు ఎంత వినసొంపుగా వుండేదో ! టేపురికార్డర్ వుంటే ఆ నవ్వును టేపులో ఎక్కించి జీవితమంతా వినకూడదా ?

నా కథకు ఈ ఒక్కజంటే ప్రేరణ కాదు— నర్సయ్య, మల్లమ్మ అనే జంటకూడా. కిరణ్, లావణ్యల ఇంటి కెదురుగా అంటే నేనుంటున్న డాబా పక్కగా ఈతాకుల గుడిసెలో ఆ జంట నివాసం.

ఆ దంపతులకి పూర్తిగా భిన్నం ఈ దంపతులు. చెప్పుకోదగ్గ అందాలు వాళ్ళలో లేవు, రంగు ఇద్దరిదీ చామనఛాయే. తిండి సుఖం లేనందు వల్ల కొంచెం చిక్కి వుంటారు.

నర్సయ్య ఓలారీ ట్రాన్స్‌పోర్టు ఆఫీసులో అమాలీగా పనిచేస్తాడు. మల్లమ్మ ఆ చుట్టు పట్ల వున్న గొప్పవారి ఇళ్ళలో పనులు చేస్తూ నెలకు అరవయ్యో, డెబ్బయో సంపాయిస్తుంది.

ఎప్పుడయినా బాగా అలసి పోతేనో, మనసు ఖుషీగా వుంటేనో సారా తాగొస్తాడు నర్సయ్య, మల్లమ్మకి తాగుడంటే అసహ్యం. అలా తాగొచ్చినప్పుడు ఆ ఇంట్లో రామరావణ యుద్ధమే— 'తాగొచ్చి నాతో మాట్లాడొద్దు'' అని ఆమె అనడం, అలా అన్నందుకు బాధతో ఆయన తిట్టడం, ఆమె గట్టిగా అరవడం, ఆమె అరిచినందుకు ఆయన కొట్టడం- ఆమె ఏడవడం- అంతా ఒక దాన్తర్వాత ఒకటి సీరియల్‌గా జరిగి పోతాయి... మల్లమ్మ తన్నులు తినడం నేను చూడంగ ఆ రోజు మూడోసారి.... వాళ్ళ జీవితంలో అన్యోన్యత వుండదేమో! వాళ్ళకీ అనురాగానికి కనరాని దూరమేమో!!

లావణ్య ఇంట్లో పని చేస్తూ కూడా వాళ్ళ దాంపత్యంలోని అన్యోన్య తనిచూసి అసూయ పడదేమో మల్లమ్మ.

అసలు ఈ రెండు జంటలకి పోలిక ఎక్కడయినా వుందా? లేదు. అందుకే నేను రాసిన కథకి ప్రేరణ అయ్యారు.

ఎవరో బిగ్గరగా పాడుతోంటే దానికి కోరస్‌గా కొన్ని గొంతులు పాడుతూ వుండడం వినడంతో కథని పక్కకి పెట్టి వరండాలోకి వచ్చాను. కొంచెం దూరంలో దాదాపు పాతిక మంది యువతీ యువకులు కొందరు ఏవోరాసిన అట్టలు చేతుల్లో పట్టుకున్నారు, మరి కొందరు అట్టల్ని సైకిళ్ళకు తగిలించుకొన్నారు. ఇంక కొందరు చిన్న చిన్న డబ్బాలు చేతుల్లో పట్టుకుని విరాళాల కోసమేమో ఇంటింటి వేపు వెళుతున్నారు. నేను గబగబా మెట్లు దిగి కిందికి వచ్చాను. విషయమేమిటో కనుక్కోవాలని.

వాళ్ళు దగ్గరవుతున్న కొద్దీ స్పష్టంగా కనిపించాయి అట్టమీద రాతలు "తుఫాను బాధితుల సహాయార్థం విరివిగా విరాళాలు ఇవ్వండి" అని ఎర్రటి ఇంకుతో రాసి ఉన్నాయి. ఆ వాక్యం కింద ఆకుపచ్చటి ఇంకుతో అదేదో "సాహితీ సంస్కృతిక సంస్థ' అని రాసుంది.

ఆ గుంపులోని ఒకాయన్ని పిలిచి అడిగాను. "ఏమిటి కథ" అని.

"ప్రభుత్వం తుఫాను బాధితులకి చేసే సహాయాల పట్ల మాకు నమ్మకం లేదు. డబ్బుగానీ వస్తువులుగాని ఎవరికి చేరాలో వారికి చేరడం లేదు. మధ్యలో చాలా మటుకు మాయం చేస్తున్నారు. అందుకే మేం ఇలా విరాళాలు సేకరిస్తున్నాం'' అన్నాడు.

"మరి మీరు ఎవరికి చేరాలో వారికి చేరుస్తారని మాకు నమ్మకమేమిటి?'' అడిగాను.

"మాది ప్రజా సంస్థ. మేం చిత్తశుద్ధితో పన్జేస్తాం. మా మీద నమ్మకముంటే విరాళం ఇవ్వండి, లేకుంటే ఇవ్వకండి" అని చాలా తేలిగ్గా, సులభంగా చెప్పాడు.

నేనేం మాట్లాడ లేదు.

నాజేబులో ఉన్న నాలుగు పావలా రూకల్లో రెండింటిని తీసి వాళ్ళ విరాళాల డబ్బాలో వేశాను. రూపాయి వేయాలంటే మనసు వొప్పలా.

ఎంతేస్తేనేం.... అర్థ రూపాయుంటే సిగరెట్లు కొస్తుంది లేదా టీ కొస్తుంది.

పాడుతోన్న పాట అయిపోయిందేమో ఇంకోపాట కోసం ఒక రెండు క్షణాలు అగి....

"జనం కలం యోధులం.... జనం కళాకారులం

జనం కొరకు కలం బట్టు.... జనవిముక్తి కాములం."

....పాట ఎత్తుకుని ముందుకు కదిలి పోయారు. మునుపెన్నడూ వినని చక్కటి బాణీలో ఉంది, ఆపాట.

లావణ్య గేటువద్ద కొచ్చి నిలబడింది ఆకోలాహలాన్నిచూస్తూ. ఇద్దరు కార్యకర్తలు విరాళాల డబ్బా తీసుకెళ్ళి అడిగారు. ఆమె కదల్లేదు. "మా వారింట్లో లేరు" అంది. ఆ కార్యకర్తలు "మీకు తోచినంతయివ్వండి" అన్నారు. ఆమె "లేవు" అన్నట్టు గాల్లో చేయి తిప్పి ఇంట్లోకి వెళ్ళి తలుపేసుకుంది.

కోరస్‌లో పాట బ్రహ్మాండంగా సాగుతోంది....

మల్లమ్మ గుడిసెలోంచి తడికె తలుపు తీసుకొని బయటికి వచ్చింది. ఏడ్చి యేడ్చి కళ్ళు ఉబ్బి ఉన్నాయి. మొహం చెమటతో తడిసి మరీ నల్లగా, జిడ్డుగా ఉంది. తల అంతా రేగి ఉంది.

ఆ కార్యకర్తలు ఆమె దగ్గరకూ వెళ్ళారు. నాకు నవ్వొచ్చింది-ఏదో సామెత జ్ఞప్తికొచ్చింది. ఆమె బాధలో ఆమె ఉంటే వీళ్ళు అడగడం చూసి కాని.... ఆమె కొంగు విప్పుతోంటే నాకు ఒకటే ఆశ్చర్యం! ఆ కొంగులోంచి ఎర్రటి రెండు రూపాయల కాగితాన్ని విరాళాల డబ్బాలో వేస్తోంటే మరీ ఆశ్చర్యం!!

జేబులో రూపాయి ఉంచుకొని కూడా అర్ధ రూపాయి మాత్రమే వేసిన నేను, మల్లమ్మ సాహసం చూస్తుంటే ఆశ్చర్యం కాక మరేమిటి. నాకు సిగ్గనిపించింది. అయినా.... మల్లమ్మని మనసులో అభినందించాను.

మరి.... లావణ్య— 'మావారింట్లో లేరండే!'

భర్త ఇంట్లోలేందే ఏ పనికీ ముందుకు రాలేదా?

* * *

అన్యోన్య దాంపత్యంపై రాసిన కథకు "జీవిత మాధుర్యం" అని పేరు పెట్టాను. ఆ కథను వారం రోజులపాటు నా మిత్రులు చాలా మంది చదివారు. తెగ మెచ్చుకున్నారు.

అందులో కిరణ్ పాత్ర ఎంతో గొప్పగా ఉందన్నారు. 'నర్సయ్య పాత్రలాంటి వాళ్ళు తాగొచ్చి భార్యని చంపెయ్యక ఏముంది?' అన్నారు.

ఓ అర్థరాత్రి దాన్ని ఫెయిర్ చేశాను. పొద్దునే ఏదయినా పత్రిక్కి పంపాలని.

లైటార్పి మంచం మీద కూచుని తాపీగా సిగరెట్ కాలుస్తూవున్నా ఆ కథని గురించిన ఆలోచనలతోటి మనసంతా హాయిగా ఉంది. మిత్రులు ఆ కథ పట్ల తెలిపిన అభిప్రాయాల్ని నెమరేసు కుంటున్నా.

గుడిసెలోంచి మల్లమ్మ మూలుగుతోంది. మూడు రోజుల్నించి జ్వరంతో బాధపడుతూన్నట్టుంది. జ్వరం ఇప్పుడింకా ఎక్కువయింది గావాల్ను.

ఆ సమయంలోనే కిరణ్ ఇంటి బయటి దీపం వెలిగింది. సన్నగా గాజుల శబ్దంతో పాటు నవ్వుకూడా వినిపించింది. ఎందుకో.... నాకు అనుమానంవేసి బయటికి వెళ్ళి వరండాలో నించున్నాను వాళ్ళ యింటి దీపం

వెల్తారు. వీది దీపం వెలుతురూ నా మీద పడకుండా స్తంభం చాటునించి చూశాను.

కిరణ్, అతనితోపాటు ఎవరో అమ్మాయి. వాళ్ళింటికున్న చిన్ని పార్కులో నించునున్నారు. ఆమె లావణ్య కాదు. అది మాత్రం నిజం. లావణ్య సాయంత్రమే వాళ్ళనాన్నతో పాటు పుట్టింటికి వెళ్ళి పోవడం నేను కళ్ళారా చూశాను. మరి - ఆమె?.... కిరణ్ బంధువా? బంధువయితే ఒంటరిగా వున్న కిరణ్‌తో ఈ వేళప్పుడేం పని?

షెడ్‌నించి స్కూటర్ని గేటు బయటికి తీసుకొచ్చాడు కిరణ్. మళ్ళీ వెనక్కి పోయి బయటి లైట్ ఆఫ్ చేసి ఇంటికి తాళం వేసి వచ్చాడు.

"కిరణ్! ఒంటిగంటయింది. ఎట్లా?" ఆమె అంది.

"ఏముందీ, ఫ్రెండ్స్‌తో సెకండ్ షోకి పోయినాని చెప్పు" అన్నాడు కిరన్ స్కూటర్ స్టార్ట్ చేయడానికి సిద్ధమౌతూ.

"సరేలే.... నాస్థానంలో నువ్వుంటే నీకు తెలిసేది అప్పరేగాని లావణ్య...." అంటూ ఏదో చెప్ప బోతుండగా విసుక్కుటూ అన్నాడు—

"ఆపాడు మొహం పేరెత్తకు" ఇంకా కిరణ్ ఏదో అంటూ ఉండగానే స్కూటర్ స్టార్టయింది. ఆ శబ్దంలో కిరణ్ ఏమన్నాడో పూర్తిగా విన్లేక పోయాను.

ఈ మాటలన్నీ లీలగా వినబడ్డాయి.

స్కూటర్ పైన ఇద్దరూ ఎక్కి వెళ్ళిపోయారు. బొమ్మలా చూస్తూ వుండిపోయాను. ఆలోచిస్తూ కిందికి దిగి వచ్చాను.

ఏమిటీ? నేను లీలగా విన్నదంతా నిజమే? లావణ్యను 'పాడు మొహం' అంటున్నాడా? అయితే.... లావణ్యపట్ల అతని ప్రేమ, అనురాగం,

ఆప్యాయత, అన్యోన్యత అంతా బూటకమేనా? అంతా మేడిపండుకన్న మెరుగు వంటిదేనా?

నా కథలో ముఖ్యపాత్రయిన కిరణేనా ఆ మాటంది?

"లెయ్యే.... గంజి వెచ్చగ బెట్నాను లెయ్యే" నర్సయ్య మల్లమ్మని లేపుతోంటే— ఆలోచనల్లోంచి తేరుకున్నాను. ఆమె 'ఊఁ' అంటూ ఉంది. అది మూలుగో 'సరే' అనడమో నాకర్థం కాలేదు.

"లెయ్యే. లేసి కాసిన్ని గంజినీళ్లు తాగు.... కడుపులోకింత పడితే బాగుంటాది. మందు మింగొచ్చు." ఎంతో ఆత్మీయతా అనురాగంతో వున్నాయి అతని మాటలు.

"గంజితాగలేనే.... నోరంతాసేదు.... తాగితే వాంతి కొస్తాదేమో. ఉత్త మందు మింగుతాలే." మల్లమ్మ బలవంతాన, బరువుగా మాటాడుతోంది.

"సందకాడ తాగమంటే మల్లా తాగుతానంటివి. ఉత్త మందుమింగి నిద్దరపోతివి. గంజి ఎచ్చగ బెట్నా యిప్పుడన్నా కాసింత తాగు మనసు నిమ్మలంగుంటాది.... సెయి చూడు ఎట్ల కాలిపోతాందో అద్దరాతిరప్పుడు ఈ మాత్తర్లు మింగించమన్లే డాక్టరు?"

"సందకాటి కంటే జర మెక్కువయిందే.... లావణ్యమ్మ వూరికి బోయింది. నేను అంట్లుదోమేకి బోలేదని కిరణయ్య అర్సి పోయినాడు. ఇంజినీరయ్యోళ్లింట్లో రేపు అదేందో పండగంట పొద్దున్నేలకే శానా పన్లున్నాయి రమ్మన్నేరు.... నాకు సూస్తే ఈ కాయలా ఇడసకనేపాయె....

రః కాయలా ఇట్లేవస్తే సచ్చిపోతానేమోనే''— చివరి మాటలు అంటూన్నప్పుడు గొంతు పూడుకుపోయింది మల్లమ్మకి.

"మందు మింగితే తెల్లారేతలికే జరమిడుస్తాదిలే.... సచ్చిపోతననొద్దే, నువ్వులేకుంటే....'' మాటాడుతున్న నర్సయ్య ఎందుకో ఆపేశాడు. వాక్యాన్ని పూర్తి చేయలేక పోయాడు.

మల్లమ్మ లేని బ్రతుకు ఊహించలేక పోతున్నాడేమో!

నా కళ్ళు చెమ్మగిల్లాయి.

గబగబ గదిలోకెళ్ళి చీకట్లోనే ''జీవితమాధుర్యం'' కథని ముక్కలు ముక్కలుగా చించేశాను.

*

(1980, జనవరి, ప్రజాసాహితి.)